# గోదావరి స్టేషన్

గోదావరి జలాలలో మునిగి వచ్చిన గాలి నన్ను తాకింది. బాగా చలి వేసింది. చీర కొంగు తలమీద నుంచి కప్పుకొని బెంచిమీద నుంచి లేచాను.

నిర్జీవముగా వుంది పార్క్, జాతర ముగిసిన మరునాటి గుడిప్రాంగణములా వుంది. జీవితాలకు విద్యుద్దీపాలని అలంకరించే పిల్లలు కేరింతలుకొడుతూ ఆడుకొని వెళ్ళిపోయారు. ఆడుకుంటున్న పిల్లల మోముల్లో విరిసిన ఇంద్ర ధనస్సులు చూసి మురిసిపోయిన పెద్దలు కూడా ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. వెలుగు రేఖలు సమంగా పడనిచోట కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తమకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకున్న యువజంటలు కూడా కదలిపోయాయి.

ఇంకా అక్కడ వుండటము నావల్లకాలేదు. బయటకు నడిచాను.

పూర్ణేందువనే బొట్టు చెరిగిపోయిన ప్రపంచము అమావాస్య చీకటిలోకి జారుతోంది.

రోడ్డుమీదకు వచ్చాను. ఇప్పుడు ఎక్కడకు వెళ్ళటము ?

ఇంటికి వెళ్తే.........

ఏముంది, ఇంట్లో.....

నాలాగే ఏ నిముషములోనైనా కూలిపోవటానికి సిద్ధముగా వున్న యింట్లో చేసేదేముంది ? పెచ్చులు ఊడిపోయి, రంగులు వెలసిపోయిన, గోడలని చూస్తూ కూర్చోవటము తప్ప చేసేదేముంది?

లేదు. నేను యింటికి వెళ్లలేను.

ముందుకి నడిచాను. నాలుగు అడుగులు వేసేనో, లేదో ఆగిపోయాను. రోడ్డు మలుపు తిరగేచోట గుమిగూడి ఉన్నారు జనము. ఏవేవో మాటలు వినబడుతున్నాయి.

“ఏమైంది?” గబగబ నడిచి వాళ్ళని సమీపించి అడిగాను.

నామాటలు ఎవరూ పట్టించుకోలేదు. నన్ను ఆదోలా చూసి వాళ్ల మాటల్లో వాళ్లు మునిగిపోయారు. ముసలిదానికి జవాబివ్వటమేమిటనేది కాబోలు వాళ్ళభావము.

"కళ్ళు, కాళ్ళూపని చెయ్యని వాళ్ళు యింట్లో పడి ఏడవవచ్చు కదా?" నూనూగు మీసాల యువకుడు ఒకడన్నాడు. "రోడ్డు మీదకు వచ్చి మమ్మల్ని ఏడిపించట మెందుకు?"

"ఏరాచకార్యాలు మునిగిపోతాయని వీళ్లు రోడ్డుమీద తిరుగుతున్నారో!" మరొకడు వంతపాడాడు.

"నాకూ అదే అర్థము కావటము లేదురా" మరో యువకుడు అన్నాడు. "తిరిగినంత కాలం తిరిగారు కదా? కళ్ళూ, కాళ్ళూ ఆడనప్పుడయినా, యింట్లో పడివుండవచ్చుకదా?"

మరికొంత దూరము ముందుకుసాగేను. అప్పుడు కనబడింది, ఆ దృశ్యము చేతి కర్రసహాయంతో లేవటానికి ప్రయత్నిస్తోంది రోడ్డుమీద పడిన ముసలావిడ. సుమారు ఏడుపదులు సంవత్సరాలు దాటి వుండవచ్చు, ఆవిడకి.

"నన్నెందుకురా ఆడిపోసుకుంటారు" చేతికర్ర రోడ్డుమీద అన్చుకుని మెల్లగా అడిగింది. "నువ్వుకదా వచ్చి నన్ను గుద్దేసింది?"

నేను చుట్టూ దృష్టిమళ్ళించాను. రోడ్డు వారగా పడివుంది, ఒక స్కూటర్. ఆ స్కూటర్‌ని ఆనుకొని నిలబడివుంది ఓ పాతికేళ్ళ అమ్మాయి.

"నువ్వెళ్ళమ్మా ఈవిడ మాటలతో మనకేంపని" రోడ్డు మీదపడి వున్న స్కూటర్‌ని పైకి లేపి ఆమెకి అందిస్తూ అన్నాడు ఒక కుర్రవాడు. "ఆవిడ రోజులు ఎప్పుడో గడిచిపోయాయి"

నిజమే ! ఆవిడ రోజులే కావు ఆవిడలాంటి మాలాంటి ముసలివాళ్ళ రోజులు ఎప్పుడో గడిచిపోయాయి.

కానీ కృంగి, కృశించిపోయలా ప్రవహించినా, గోదావరి జీవనదియని

యిరువైపుల జనానికి ప్రాణదాయని అని బ్రతుకుచూడని కుర్రవాళ్ళకి ఏమి తెలుస్తుంది?

జనాన్ని దాటుకుంటూ ముందుకునడిచాను. ఎదురుగా ఉన్న గోదావరీ స్టేషన్ చేరుకోవటమే నా లక్ష్యం.

చీకటిగా వుంది స్టేషన్ ఆవరణ. జీవితపు వసంతకాలములో వచ్చిపోయే అతిధులకోసము, చుట్టాలకోసము అహర్నిశలూ శ్రమపడి, అలసిపోయి, అకాల వార్ధక్యములోకి జారిపోయి, నీరసముగా పడుకున్న అతివలా ఉంది స్టేషన్. ఏ మాటలు అన్నాఎదురు తిరగరనే ధైర్యము వల్ల ముసలివాళ్లమీద విసరే దుర్భాషితాలలా స్టేషన్ చుట్టూ చెత్తాచెదారము విసరేసి వున్నాయి.

మెల్లగా అడుగులు వేసి ప్లాట్‌ఫారము ఎక్కాను. ఏ నిముషములోనయినా ఆగిపోయే ముసలి వాని గుండెలా వెలిగి ఆరుతోంది. ఒకే ఒక ట్యూబ్‌లైటు. ఒకప్పుడు సరకులమ్మిన దుకాణాలు సందడిగా ఉన్న ఆఫీసు గదులు, ఖాళీగా గాలి తీసిన బెలూన్లలా ముడుచుకుపోయి ఉన్నాయి.

ముందుకి నడిచాను. ప్లాట్‌ఫారము మీద నిద్రపోతున్న ముసలి కుక్కలు ఓసారి బద్ధకముగా కళ్ళు తెరచి చూసి మళ్ళీ పడుకున్నాయి.

రోజూ ఆ ప్లాట్‌ఫారము మీద గంటలతరబడి కూర్చోవటమ నాకు అలవాటు. ఏ బండి ఆగని గోదావరి స్టేషన్ నా బ్రతుకుకు ప్రతీకలా అనిపిస్తూ వుంటుంది నాకు.

ఒక కుర్చీమీద నడుమువాల్చాను. కాళ్ళూచేతులు నొప్పిగా వున్నాయి. సాయంత్రము నాలుగు గంటలనుంచీ తిరుగుతూనే వున్నాను. ఏమీ తినలేదు, త్రాగలేదు కళ్ళుమూతలు పడుతున్నాయి.

పట్టీ పట్టని నిద్రలో ఎవరో లేపినట్లు తోచింది. కర్రతో ఎవరో పొడిచినట్లు బలవంతముగా కనురెప్పలు విప్పాను. ఎదురుగా నిలబడి విన్నాడు గుబురు మీసాలహెడ్డు.

"ఏమిటే ముసలీ నీకు రోజూ చెప్పాలా, ఇక్కడ తొంగో కూడదని? యిదేమన్నా నీబాబుగాడి సొమ్మా...." కర్రతో మరోసారి పొడిచాడు హెడ్డు.

హెడ్డుతోనాకు బాగా పరిచయమే. ఆగని ట్రైన్‌లని చూస్తూ స్టేషన్‌లో గంటలు గడిపే నాతో అప్పుడప్పుడు కబురులు ఆడుతూ వుంటాడు అతను. 'టీ' కని సిగరెట్లు కనీ అయిదూ, పదీ తీసుకుంటూ వుంటాడు. నిన్ననే వాడికి పాతిక రూపాయలిచ్చాను. ఆ డబ్బు పుచ్చుకున్నప్పుడు ఎంతబాగా మాట్లాడాడు.

మెల్లగాలేచాను. వాడిని నాలుగు తిట్టాలనీ, ఛడామడా దులపాలనీ నోరు తెరచాను కానీ.....

అంతలో గుర్తుకువచ్చింది.

వాడు పుచ్చుకున్నది పాతికరూపాయలేగా !

తన జీవితమంతా పుచ్చుకున్న కొడుకు ఏమిచేసాడు !

పదిసంవత్సరాల క్రితము యిక్కడే బండి ఎక్కాడు వాడు. ఉద్యోగములో చేరి రెండునెలలు పోయాకా వచ్చి నన్ను తీసుకొని వెళతానన్నాడు కానీ..... వాడురాలేదు. యిప్పుడు గోదావరీ స్టేషన్‌లో బళ్ళే ఆగటములేదు.

చీరకొంగుతో కళ్ళు ఒత్తుకున్నాను.

ప్రపంచములోని వెలుగుని తన గుప్పెట్లో పెట్టుకొని, పశ్చిమార్ణవములోనికి దూకుతున్న సూర్యుడిని చూస్తూ ఇంటి గుమ్మందగ్గర నిలబడ్డాను నేను. ఏదో బండి ఆగిన శబ్దము విని తల ఎత్తి చూసాను. నలుగురు ఆయనను మోసుకొని వచ్చి గుమ్మందగ్గర పడుకోపెట్టారు. నా కళ్ళు తిరిగియి. ఎంతసేపు అలా గడిచిపోయిందో తెలియదు. తెలవి వచ్చినప్పుడు యిల్లంతా హడావిడిగా వుంది. చుట్టాలు, స్నేహితులూ, యింటినిండా వున్నారు. "పాపం సముద్రములో పడిపోయారట" వీధి గుమ్మం అవతల పడుకోపెట్టిన అతని కళేబరాన్ని చూసి వెళ్ళేవారి మాటలు నా చెవిలో పడ్డాయి.

నేను కదలలేదు. చుట్టూవున్న ప్రపంచము ఓ పెద్ద సున్నాలా అనిపించింది నాకు.

"జరిగిందేమో జరిగిపోయింది" ఓ ముసలావిడ నా దగ్గరకు వచ్చి అంది. "బాధ పడితే పోయిన ఆయన వస్తారా, అమ్మా"

"ఎంతో కొంత చదువుకున్న దానివి, నీకు చెప్పదగ్గ దానిని కాదనుకో" మరో ముసలావిడ అంది. "ఓ పదిసంవత్సరాలు కష్టపడ్డావంటే నీ కొడుకు చేతికి అందివస్తాడు. ఆ తర్వాత నీ కష్టాలు తీరిపోతాయి.

నిజమే! వీడు ఎదిగితే ఇంక కష్టమేముంటుంది!

నేను లేచాను. శక్తి కూడకట్టుకుని ముందుకి నడిచాను. శుక్లపక్షపు చంద్రునిలా దినదిన ప్రవర్ధుడయ్యాడు వాడు. పదిహేను సంవత్సరాలలో పూర్ణ చంద్రునిలా ఎదిగాడు.

ఇంజనీరింగ్ చదివాడు. గుజరాత్‌లో మంచి ఉద్యోగము వచ్చింది. ఉద్యోగానికి బయలుదేరుతూ వాడన్న మాటలు ఇంకా నాచెవిలో గింగురుమంటున్నాయి.

ఈ ప్లాట్‌ఫారము మీదే బండి ఆగింది, ఆరోజు బండి బయలు దేరకముందు బండిలోనుంచి చేతులు బయటకి చాచి నాకన్నీళ్ళు ఒత్తుతూ అన్నాడు వాడు, "బాధపడకమ్మా ఓ రెండు నెలల్లో యిల్లుచూసి నిన్న తీసికెళతానుగా"

బండి వెళ్ళిపోయింది. అంతవరకు చక్కని వెన్నెలను అందించి మబ్బు తెరవెనుక జారుకున్న చంద్రుని వెలుగులో అడుగులు వేసాను, ఇంటివైపు.

రోజులు గడిచిపోయాయి. ఆరునెలలు తర్వాత వచ్చింది, మొదటి వుత్తరము వాడు అమెరికా వెళతాడట! ఆశగా ఉత్తరాన్ని అటూ, యిటూ తిప్పిచూసాను, వాడి చిరునామా ఎక్కడా కనబడలేదు.

గట్టిగా నిట్టూర్చి కళ్ళుఒత్తుకున్నాను.

బ్రతుకు వేగము పుంజుకుంది. సైకిలు మీద వెళ్ళినవారు స్కూటర్‌లోకి మారారు. రోడ్డు నిండా కనబడిన సైకిల్ రిక్షాలు ఆటోలకి, దారి యిచ్చి కనుమరుగయి పోయాయి. అక్కడక్కడా కారులు కూడా కనబడుతున్నాయి.

గోదావరి స్టేషన్‌లో ఆగే బళ్ళ సంఖ్య తగ్గిపోయింది.

మానవ సంబంధాలను కలపటము కోసము సంత్సరాల క్రితం నిర్మించిన వారధి బలహీనమైపోయిందట!

చూపుమందగించింది, కానీ ఎదురుచూపు మానలేదు. ప్రతీ రోజూ వచ్చి ఈ బల్లమీద కూర్చుంటూనే ఉన్నాను.

ఇక్కడే కనబడ్డాడు, ఓ రోజు సుబ్బారావు, సుబ్బారావు మా ఈడు వాడే అమెరికాలో వుంటుంన్నాడని విన్నాను.

నా మనస్సుకి పట్టిన ముసురు ఊరంతా పాకినట్లు అయింది. ఆరోజు చిన్న తుంపర్లుకూడా పడుతున్నాయి. వాన జల్లునుంచి తప్పించుకోవటముకోసమని కొంత దూరములో వున్న బల్లవైపు నడుస్తూ వుంటే కనబడ్డాడు సుబ్బారావు.

"మీరు - మీరు......" అతను సుబ్బారావు అవునో, కాదో అనే అనుమానముతో నా గొంతు తడబడింది.

"నేను సుబ్బారావునే సీతా" సుబ్బారావు అన్నాడు. "బాగున్నావా అని నేనడగను ఎందుకంటే నువ్వెలాగున్నావో నాకు తెలుసుకదా" అతను చేతిలో వున్న పైపు ఓసారి నోట్లో పెట్టుకొని గట్టిగా పొగపీల్చి అన్నాడు.

"నీ కొడుకు గురించి నువేమి అడగబోతున్నావో నాకు తెలుసు పాపం పిచ్చిది తల్లిమనస్సు" సుబ్బారావు ఓ నిమిషము ఆగేడు. ఆతర్వాత అన్నాడు "వాడికి ఏమిటమ్మా! బ్రహ్మాండముగా వున్నాడు. దొరసానిని పెళ్ళిచేసుకున్నవాడికి అమెరికాలో లోటేమిటమ్మా!"

ఆకాశము ఓసారి వురిమింది. ఆ వురుముకు తట్టుకోలేక నేను, చెవులు మూసుకున్నాను.

పెనుతుఫానే వీచింది అంతవరకు మూగగా ఓపాయలా రోదిస్తూ వెళ్ళిన గోదావరీ తల్లి, గుండెలోని దుఃఖము కట్టలు తెంచుకొని ప్రవహించి ఒడ్డున వున్న యిళ్ళని జలమయము చేసింది.

వివరము విని వచ్చింది మా చెల్లెలు. తనతో రమ్మని బలవంతము చేసింది. "మేమేమన్నా పరాయివాళ్ళమా చెప్పు, నా పిల్లలు నీపిల్లలు కాదా?' ' నా చెల్లెలు అంది. "వాడు పోతే పోయాడు మాతో వుండవచ్చుకదా?" ఉండాలనే అనుకున్నాను.

ఆ వుద్దేశముతోనే దాని వూరు వెళ్ళాను. అంతా బాగుంటే ఉద్యోగం బదిలీ చేయించుకోవాలని కూడా అనుకున్నాను. కానీ.....

"పెద్దమ్మ వాళ్ళవూరు ఎప్పుడు వెళుతుందమ్మా?" బయటికి వెళ్ళి వస్తున్న నేను ఆమాటలు విని ఆగిపోయాను.

"ఊరు వెళ్ళదమ్మా యిక్కడే వుంటుంది"

"ఎందుకని?"

"పెద్దమకి ఎవరూ లేదు కదమ్మా, మనంతప్ప. అందుకే యిక్కడు వుంటుంది"

"నా కిష్టంలేదమ్మా" ఆధునిక చదువులు, సంస్కారములు నూరిపోసిన స్వార్ధానికి బానిసయిన అమ్మాయి ఖచ్చితంగా అంది.

"అలా అనకూడదమ్మా, పెద్దమ్మని మనం చూడకపోతే మరెవరు చూస్తారు?"

"అదినాకు తెలీదు. అసలే యిల్లు యిరుకు, దానికి తోడు ఆవిడ దగ్గు ఒకటి రాత్రంతా నిద్రపోనివ్వటమే లేదు"

"మందు లేసుకుంటే దగ్గు తగ్గిపోతుందిలే"

"దగ్గుకంటే మందు తీసుకుంటుంది. కానీ ఆవిడ ఆలోచనలకి మందులు వాడలేముకదమ్మా?" ఓ నిముషము మాటలూ ఆగిపోయాయి నేను యింటిలోకి అడుగుపెట్టాను.

"నేను జీన్సువేసుకుంటాను, జుత్తు కత్తిరించుకుంటాను. అది నా యిష్టం, ఆవిడ యిష్టం కాదు కదా? అవన్నీ పెద్దమ్మకి ఎందుకమ్మా?"

"కూరంతా అలా ఏరిపారేస్తావేమిటి?" నా అడుగుల సవ్వడి వినటం వల్ల కాబోలు మాటమారుస్తూ అది మా చెల్లెలు.

"చూడమ్మా బాగాచూడు. ఇదేమీ కూరకాదు, కరివేపాకు. "కూరలో కరివేపాకును ఏరిపారేయక తినేస్తారా?"

"అక్కడ నా స్థానము ఏమిటో నాకు అర్థమయింది. ఆరోజే బయలుదేరాను మా వూరికి.

"ఇంకా యిక్కడే తొంగున్నావన్నమాట. నిన్ను..... నిన్ను......" మళ్ళీ వచ్చాడు హెడ్డు.

మెల్లిగా లేచి ముందుకు నడిచాను. ప్లాట్‌ఫారము దిగి పట్టాలు దాటి గోదావరీ ఒడ్డున నడిచి వెళితే యిల్లు చేరుకోవచ్చు.

ప్లాట్‌ఫారము దిగాను. జీవితములో దాటవలసిన వివిధ ఘట్టాలలాంటి పట్టాలు, ఒకటి వెనుక ఒకటి కనబడ్డాయి. దృషినానించి మెల్లిగా పట్టాలు దాటుకుంటూ ముందుకు సాగేను. ఆఖరి పట్టాదాటుతూ వుంటే గుండె జారిపోయింది.

ఎదురుగా అతివేగముతో వస్తోంది ట్రైన్!

కళ్ళు తిరగిపోయాయి. పట్టాల మధ్యన పరచిన రాళ్ళకు కాళ్ళు తగిలి అవతల పడ్డాను.

కళ్ళు తెరచినప్పుడు ఓ నులకమంచము మీద పడివున్నాను. ప్రపంచాన్ని కబళించిన చీకటి పూర్తిగా తొలగిపోయింది.

ఉదయ సూర్యుని వెచ్చని కిరణాలు, ఊడిపోయిన తాటాకుల సందులలో నుంచి వచ్చి నన్ను పలకరించాయి.

కళ్ళు తెరచి చూసాను. ఎదురుగా నిలబడి వున్నాడు, ఓ కూలివాడు.

"ఒసే, అమ్మగారు లేచారో" నేను కళ్ళు తెరవటము చూసి అతను ఆనందముతో అరిచేడు "టీ నీళ్ళు పట్రావే"

ఒక ఆమె నా దగ్గరకు వచ్చింది. చేతిలో ఒక చిన్న కేరియర్ గిన్నె, చంకలో నెలల పిల్ల.

"టీ తీసుకోండి అమ్మగారు" ఆమె కేరియర్ గిన్నె నాకు అందించింది.

"టీ తీసుకుంటే బాగుంటుంది, ఓపిక వస్తుంది"

నేను ఆ యిద్దరినీ చూస్తూ పడుకున్నాను. అసలు కదలలేదు.

"టీ మేము చేసింది కాదు అమ్మగారు మీ కోసము హోటలు నుంచి తెచ్చాము. తీసుకోండమ్మగారు"

నేను యిష్టములేక పోయినా 'టీ' అందుకోవలసి వచ్చింది.

"నాకు పనిటయిము అయిపోనాది, నేను వెళతాను, నువ్వు వుండి పోయి అమ్మగారిని జాగ్రత్తగా చూసుకో"

అతను వెళ్ళిపోయాడు. వాళ్ళిద్దరూ గోదావరి పై కొత్తగా నిర్మించే వంతెన కోసం, పనిచేసే కూలీలట! నన్ను రోజూ ఆ రోడ్డు మీద చూస్తూ వుంటారట! అంతే కాదు నాగురించిన వివరాలు కూడా వాళ్లకి తెలుసట!

నులకమంచం మీద అసహనముగా కదిలేను, నేను యింటికి వెళ్ళాలి.

మంచము దిగుతూ వుంటే పరుగెత్తుకొచ్చింది ఆమె.

"కదల కండమ్మా, మీరు పడుకోండి"

"లేదు నేను యింటికి వెళ్ళాలి"

"ఒద్దమ్మగారు ఉండండి యింటిదగ్గర మీకు ఎవరున్నారని? యిక్కడే వుండండి. మాకు కలిగింది మేము పెడతాము"

నేను ఆశ్చర్యముతో వుండిపోయాను. లక్షలు సంపాదిచే కొడుకు చెప్పని మాట దీని నోటినుంచిరావటమేమిటి ? సంపాదించే కొద్దీ, డబ్బుమీద ఆశ పెరుగుతుందని చెప్పటము నిజమే కాబోలు!

నేను మెల్లగా అడుగులేసాను. తడక తలుపు దాటుతూ వుంటే కాళ్ళకి ఏదో మెత్తగా తగిలినట్లు తోచింది.

వొంగి చూసాను.

సంవత్సరము నిండని ఆమె బాబు నా పాదాలని తడుముతున్నాడు.

హృదయము స్పందించింది. కానీ ముందుకి సాగేను. ఆపసి కందు చేతులు నా పాదాలను విడచి పెట్టలేదు. పాదాలకి తగిలే చీర అంచులని పట్టుకొని లాగుతున్నాడు. బోసినవ్వులు నవ్వుతున్నాడు. మనకు తెలియని వాడి భాషలో ఏవేవో చెబుతున్నాడు.

నాలో ఏదో చెప్పలేని స్పందన!

హఠాత్తుగా వాడిని ఎత్తుకున్నాను. వాడిని ఎత్తుకుని ముందుకు నడిచాను. ఇంటివైపు కాదు,

ఇరువైపులా వున్న మానవసంబంధాలను కలపటానికి, కొత్తవారధి నిర్మిస్తున్న కూలీలవైపు.

(ఆంధ్రప్రభ వారపత్రిక 16-2-2002)